క్లుప్తంగా

ఉక్కు వెంకన్న ఆలయంలో గిరి ప్రదక్షిణ



ఉక్కు వెంకటేశ్వరస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం 6 గంటలకు ప్రారంభించిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో సాగింది. అంతకు ముందు వేకువజామున స్వామికి ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ స్వామి ప్రత్యేక పూజలు చేశారు.

ఈపీఎఫ్‌-95 పెన్షన్‌పై వినతి



ఎంపీ భరత్‌కు వినతిపత్రం అందిస్తున్న ఈపీఎఫ్ సంఘం నాయకులు

అక్కిరెడ్డిపాలెం: ఈపీఎఫ్–95 పెన్షన్‌పై విశాఖ ఎంపీ భరత్‌కు ఆదివారం గ్రీన్ సిటీలో జరిగిన కార్యక్రమంలో పెన్షన్‌దారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ ఈపీఎఫ్–95 పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పులి రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దీనబంధు, కార్యదర్శి ఎస్.కె.హుస్సేన్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుడికి జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం



నిరాశ్రయుడిని షెల్టర్‌కు తీసుకొస్తున్న మమత


విశాఖ విద్య: పుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తికి ఆదివారం బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. పరవాడ ఏరియాలో పుట్‌పాత్‌పై కొన్ని రోజులుగా ఓ వ్యక్తి ఉంటున్నాడనే సమాచారంతో బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. పుట్‌పాత్‌పై ఉన్న అతనికి ఎవరూ లేరని తెలుసుకొని సపర్యలు చేసి షెల్టర్‌కు తీసుకొచ్చారు. మతిస్థిమితం కూడా సరిగా లేకపోవడంతో అతనికి అవసరమైన వైద్యం అందించే ఏర్పాట్లు చేసినట్లు మమత తెలిపారు.

తీరంలో మత్స్యకారుల ఆకలి కేకలు


కొమ్మాది: గత ఐదు రోజుల నుంచి తుఫాన్ నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు మత్స్యకారులు వేటకు పూర్తిగా విరామం ప్రకటించారు. ఇప్పటి వరకు అన్ సీజన్ కావడంతోపాటు అప్పులు చేసి మరీ బోట్లను, పడవలను, వలలను కొని, మరికొన్ని మరమత్తులు చేసుకుని వేటకు సిద్ధమయ్యారు. ఇంతలోనే తుఫాన్ రావడంతో ఐదు రోజుల నుంచి వేట సాగక మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని తీర ప్రాంత మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ సమయంలో కూటమి నాయకుల ఏ ఒక్కరూ ఇటువైపు చూడలేదని, సహాయక చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వాతావరణం అనుకూలించక పోవడంతో పాటు తుఫాన్ ప్రభావం కొనసాగడంతో మరో రెండు రోజులు ఇంటికే పరిమితమవ్వాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ చదువులు అంతంతే..

- ఇంకా చేరని పీపీ – 1, పీపీ – 2 పుస్తకాలు
- పాత పుస్తకాలతోనే బోధన
- ప్రైవేట్ స్కూళ్ల వైపు తల్లిదండ్రుల చూపు



పీపీ - 1 పుస్తకం



పీపీ - 2 పుస్తకం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న టీచర్

పెదగంట్యాడ: బాల్య దశలో విజ్ఞానం పెంపొందించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన బొమ్మలు, పుస్తకాలను ఆయా కేంద్రాలకు అందజేసేది. కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఆంగ్ల బోధన అందించాలనే ఉద్దేశంతో నాలుగు పుస్తకాలతో కూడిన పీపీ – 1, పీపీ – 2 కిట్లు అందించింది. ఈ కేంద్రాల్లో ప్రైవేట్ స్కూల్ తరహాలో ఆంగ్ల బోధన అందించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేందుకు ఆసక్తి చూపేవారు. బోధనకు సంబంధించి 2 నుంచి 4 ఏళ్లలోపు చిన్నారులకు ఆంగ్లం, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించి ఐదు పుస్తకాలతో కూడిన పీపీ – 1 కిట్లు, 4 నుంచి 5 ఏళ్ల వయసు కలిగిన చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ – 2 కిట్లు అందించేవారు.

పాత పద్ధతిలోనే బోధన

పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి పెదగంట్యాడ సెక్టార్‌లో 25 కేంద్రాలు ఉండగా ఇస్లాంపేట సెక్టార్ పరిధిలో 26 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిలో సుమారు 3 వేల మంది వరకూ చిన్నారులు ఉన్నారు. వీరికి ఇప్పటి వరకూ పీపీ – 1, పీపీ – 2 పుస్తకాలు నేటి వరకు అందకపోవడంతో పాత పద్ధతిలోనే పాఠాలు బోధిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటుతున్నా కొత్త ప్రభుత్వం ఇంకా పుస్తకాలు అందించలేదు. గత ప్రభుత్వంలో సకాలంలో పుస్తకాలు అందించడంతోపాటు వాటిలో చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడే పాఠ్యాంశాలు ఉండడంతో తల్లిదండ్రులు విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేవారు. నేడు పుస్తకాలు రాకపోవడంతో ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లలో చేర్పించడానికి సిద్ధపడుతున్నారని తెలుస్తోంది. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా వారికి అవసరమైన వసతులు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని బాలల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త పుస్తకాలు రాలేదు

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్త పుస్తకాలు ఇంకా ప్రభుత్వం నుంచి రాలేదు. పాత పుస్తకాలలోని కొంతమేర సిలబస్ మార్చే అవకాశం ఉంది. పుస్తకాలు వచ్చిన వెంటనే అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తాం. ప్రస్తుతం కేంద్రాల్లో ఉన్న పుస్తకాలతోనే చిన్నారులకు బోధిస్తున్నాం

– నీలవేణి, సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పెందుర్తి

మూడు రోజులుగా ముసురుకున్న చీకట్లు

విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలకు ఇక్కట్లు



మదీనాబాగ్ సమీపంలో కాలిపోయిన వైర్లు



మదీనాబాగ్ పరదేశమ్మ ఆలయం వద్ద అలుముకున్న చీకట్లు



మదీనాబాగ్ సమీపంలో తెగిపడిన వైర్లు

పెదగంట్యాడ: ఒక పక్క వర్షాలు.. మరో పక్క ముసురుకున్న చీకట్లు.. బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతన్నారు మదీనాబాగ్ ప్రజలు. తమ పరిస్థితిని ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇక్కట్లు పడుతున్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని మదీనాబాగ్‌లో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానిక ప్రజలు అగచాట్లు పడుతున్నారు. ఈ ప్రాంతంలోని వైర్లన్నీ నాసిరకం కావడంతో అవి సాగిపోతున్నాయని.. అవి కాస్తా కిందకు వేలాడుతూ గాలికి అటూ ఇటూ ఊగుతూ ఒకదానితో ఒకటి తగిలినపుడు మంటలు వ్యాపిస్తున్నాయని, దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మదీనాబాగ్‌లోని పరదేశమ్మ ఆలయం వరకూ ఈ సమస్య నెలకొందని తెలిపారు. దీనిపై ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తున్నారని, కాలిపోయిన వైర్లను మారుస్తున్నారని.. అయినా ఫలితం లేకపోతోందని ఆందోళన చెందుతున్నారు. ఒక దగ్గర వైర్లను మార్చిన తర్వాత మరో చోట ఇదే పరిస్థితి నెలకుంటోందని.. ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది ఎంత శ్రమపడినా ప్రయోజనం లేకపోతోందని చెబుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని, వర్షం కారణంగా బయటకు వెళ్లలేక ఇళ్లలోనే మగ్గిపోవాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాసిరకం వైర్ల స్థానంలో నాణ్యమైన వైర్లను ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సెయిల్‌లో విలీనం కోసం ఎంపీలు గళం విప్పాలి



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయడం కోసం రాష్ట్రానికి చెందిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వం వద్ద గళం విప్పాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో 1456వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక, మాంగనీస్ గనులకు అనుమతులు మంజూరు చేసిన క్రమంలోనే ఎంపీలు కూడా కేంద్రం వద్ద పట్టుబట్టి విశాఖ ఉక్కును పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, పరిరక్షణ కమిటీ నాయకులు దాసరి శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర, ఎస్.సత్యనారాయణ, బి.తవుడన్న, సూర్యం, శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, నాయక్, గోపయ్య, తదతరులు పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసం యజ్ఞం



మాట్లాడుతున్న రాజయోగి ముంబయి ఇన్‌చార్జ్ బీకే గణేష్ భాయీజీ

అగనంపూడి: లోక కల్యాణం, విశ్వ శాంతిని కాంక్షిస్తూ బ్రహ్మకుమారీస్ సంస్థ దశాబ్దాలుగా యజ్ఞం చేస్తుందని ముంబయి నుంచి వచ్చిన రాజయోగి బి.కె.గణేష్ భాయీజీ అన్నారు. బ్రహ్మకుమారీస్ అగనంపూడి బ్రాంచి దివ్యజ్యోతి భవనం సారథ్యంలో శనివారం ప్రారంభమైన అఖండ పరివర్తన యోగ భట్టీ కార్యక్రమం రెండో రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడ, మానవజాతి ప్రశాంతమైన జీవనం కొనసాగించడం కోసం సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. విశాఖ జిల్లా కోఆర్డినేటర్ రాజయోగిని బి.కె.సోమేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ వరకు ప్రశాంతమైన వాతావరణంలో వందలాది మంది బ్రహ్మకుమారీలు తపస్సు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అగనంపూడి ఇన్‌చార్జి బి.కె.రామకోటి, వివిధ బ్రాంచీల ఇన్‌చార్జ్‌లు బి.కె.విమల, బి.కె.సత్య, బి.కె.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

అగనంపూడి: రెండు వార్డుల్లో విస్తరించి ఉన్న అగనంపూడిలో విద్యుత్ సమస్యలు తొలగించడానికి నిర్వాసిత కాలనీల్లో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, అగనంపూడి పశువైద్యశాలకు కొత్త భవనం నిర్మించాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును స్థానిక నాయకులు కోరారు. 23 నిర్వాసిత కాలనీలతోపాటు విస్తరించిన కాలనీలు, ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీల్లో 50 వేల పైచిలుకు జనాభా నివసిస్తున్న అగనంపూడిలో నివాసాలకు సరిపడా విద్యుత్ సరఫరా జరగడం లేదన్నారు. తరచూ హెచ్చు తగ్గులుగా సరఫరా జరగడంతో గృహోపకరణాలు ధ్వంసం అవుతున్నాయని పేర్కొన్నారు. లో ఓల్టేజీ సమస్య నిత్యం వెంటాడుతోందని వాపోయారు. అలాగే అగనంపూడి పరిసర ఆరు గ్రామాల్లో 3 వేల మంది పాడి రైతులు ఉన్నారని, అగనంపూడిలో పశువైద్యశాల శిథిల వసతిలో కొనసాగుతోందని, స్థల కేటాయింపు జరిగినందున కొత్త భవనం నిర్మించాలని కోరారు. రైతు బజార్ కోసం అగనంపూడిలో స్థలం కేటాయించారని, బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని నాయకులు గొల్లవిల్లి గంగాభవానీ, బలిరెడ్డి సత్యనారాయణ, వడ్డాది శ్రీను, బందారు చందు, పట్టా పైడిరత్నం కోరారు.

వ్యాపార సముదాయం నిర్మాణానికి అనుమతివ్వండి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలోని కమ్యూనిటీ హాలు వద్ద ఉన్న ఖాళీ స్థలంలో వ్యాపార సముదాయం నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆదివారం కాలనీ కమిటీ సభ్యులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యాపార సముదాయం వల్ల వచ్చే ఆదాయం కాలనీ అభివృద్ధికి ఉపయోగకరంగా ఉంటుందని సభ్యులు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

కూలిన ఇంటి శ్లాబ్

కుటుంబానికి తప్పిన ప్రమాదం



ఇంట్లో పరిశీలిస్తున్న స్థానిక నాయకులు

కంచరపాలెం: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల ధాటికి ఓ ఇంటి శ్లాబ్ నానిపోయి నిద్రిస్తున్న ఓ కుటుంబంపై కూలిపోయింది. ఈ ఘటన 47వ వార్డు కప్పరాడ కొండ సమీపంలోని అరుధంతినగర్‌లో దేవి, భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్న ఇంట్లో జరిగింది. వర్షాల కారణంగా శ్లాబ్ పైకప్పు నానిపోయి, ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌తో సహా శనివారం రాత్రి మంచంపై నిద్రిస్తున్న పిల్లలపై ఒక్కసారిగా పడిపోయింది. అదృష్టవశాత్తు వారంతా తప్పించుకుని స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరి పిల్లల కాళ్లు, చేతులకు స్వల్పగాయలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు అక్కడికి చేరుకుని, సంబంధిత అధికారులకు తెలియజేశారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు దృష్టికి తీసుకు వెళ్తామని వారు హామీ ఇచ్చారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గోపాలపట్నం: ఎన్ఏడీ జాతీయ రహదారి బస్‌స్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. సుమారు 40 నుంచి 45 ఏళ్లు వయసు గల వ్యక్తి శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యక్తిని గుర్తించినట్లయితే ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

మార్మోగిన సాయి నామస్మరణ



దయాళ్‌నగర్‌లో బాబాకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, తదితరులు



అగనంపూడిలో పూజలు చేస్తున్న అతిథులు



కణితి రామాలయంలో అన్న సమారాధన చేస్తున్న కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: సాయి నామస్మరణ మార్మోగింది. బాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గురు పౌర్ణమి వేడుకలను ఆదివారం మండలంలోని పలు సాయిబాబా ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి మందిరంలో ఆలయ చైర్మన్ నక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో భక్తులు అభిషేకాలు చేయించారు. అనంతరం 108 రకాల పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

- జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాళ్‌నగర్‌లో గల సాయినాథుని ఆలయంలో పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబాను ఆలయ అర్చకుడు నాగబాబు శర్మ శాకంబరి అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్తలు తిప్పల నితీష్‌రెడ్డి, ప్రణీత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు.
- ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పత్రీజీ పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ప్రతినిధి మీసాల శివ గణేశ్వరరావు అన్నారు. పెదగంట్యాడలో సామూహిక ధ్యాన యజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివనాగేశ్వరరావు, వనిత దంపతులను పిరమిడ్ గురువులు, ధ్యాన కేంద్రం సభ్యులు ఘనంగా సత్కరించారు. అప్పలరాజు, నీలకంఠం, దేవిక, కనకలక్ష్మి పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో షిర్డీ సాయిబాబా మందిరంలో కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. నామాన సింహాచలం, కొల్లి కుంచారావు, నామాన వెంకట అప్పారావు, గిడితూరి అప్పారావు పాల్గొన్నారు. గాజువాక శ్రామికనగర్‌లో శ్రీ శివ దత్త సాయిబాబా మందిరంలో రుద్రాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ నిధి ప్రకాష్ నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. తాడి రమేష్, వెంకటేశ్వరావు, పెంటారావు, శ్రీనివాసరావు, చంటి, గణేష్ రావు పాల్గొన్నారు.

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెంలోని శాతవాహన నగర్‌లోని షిర్డీ సాయి దేవాలయంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొని పూజలు చేశారు. స్వామికి అన్నాభిషేకం జరిపించారు. మధ్యాహ్నం ఐదు వేల మందికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

- అగనంపూడిలోని షిర్డీ సాయి మందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నిర్వాసిత కాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విశేష పూజలు చేశారు. అన్నాభిషేకంలో స్వయంగా పాల్గొన్నారు. నిడ్‌కాఫ్ జాతీయ వైస్ చైర్మన్ వినోద్ కుమార్ గౌడ్, నాయకులు దాడి రత్నాకర్, కర్ణంరెడ్డి నరసింగరావు, మంత్రి రాజశేఖర్, రౌతు నాగేశ్వరరావు, నీలబాబు పూజలు చేశారు. కొయ్య వెంకట రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, పి.రామారావు, జి.శంభుడు, పీఎల్ఎన్‌రాజు, గోవిందరావు, సత్యలక్ష్మి, సత్యశ్రీదేవి, లీలావతి, పద్మావతి పాల్గొన్నారు.
- జీవీఎంసీ 87వ వార్డు కణితి రామాలయంలో సాయిబాబాకు క్షీరాభిషేకం, అన్నాభిషేకం జరిపించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, దుగ్గపు దానప్పలు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శంకరరావు, శ్రీను, బొడ్డ సూరిబాబు, వరకృష్ణ, సత్తిబాబు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



రక్తదానం చేస్తున్న సభ్యులు

భీమునిపట్నం : రక్తదానం ఎంతో గొప్ప విషయమని, తద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని భీమిలి సీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కైతవల్లి శ్రీనివాసరావు అన్నారు. కీతిన్‌పేటలో అసోసియేషన్, యరబాల చారిటీ సమయుక్తంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, ఇతర సందర్భాల్లో అవసరమైన వారికి తమ వంతు సాయం అందివ్వడానికి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యరబాల చారిటీ చైర్మన్ యరబాల ప్రసాద్ మాట్లాడుతూ తరచూ ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేసి అవరమైన వారిని వెంటనే ఆదుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 80 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు బ్లిస్ క్యాటరింగ్స్ ఎండీ లక్ష్మీ లావణ్య బహుమతులు అందించారు. గంటా నూకరాజు, ఎం.సూర్యశ్రీనివాస్, కాళ్ల నన్ని, ఎ.కిశోర్, ఆర్.బసవ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

న్యాయం చేసే వరకూ ఆందోళన చేస్తాం



బక్కన్నపాలెం హుద్ హుద్ కాలనీలో నిరసన తెలుపుతున్న రైతులు, సీపీఎం నాయకులు

హుద్‌హుద్ కాలనీ వద్ద కొనసాగిన రైతుల నిరసన

మధురవాడ : భూములు కోల్పోయిన కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం ప్రాంతాల రైతుల సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన కొనసాగిస్తారని సీపీఎం నాయకులు డి.అప్పలరాజు అన్నారు. రెండో రోజు ఆదివారం కూడా బక్కన్నపాలెంలోని సినీ పరిశ్రమ నిర్మించిన హుద్‌హుద్ కాలనీ వద్ద రైతులు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు చాలా నిర్లక్ష్యంగా చూడడంతోపాటు వారితో రోజుకో విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. బాధిత రైతులకు కనీసం కాలనీ ఇళ్లయినా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సియాద్రి పైడితల్లి, రైతు సంఘం పెద్దలు బి.పోతురాజు, ఎన్.పైడిరాజు, నాగేశ్వర్, అప్పారావు, కాంతం పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. ఎటువంటి గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు ఎస్ఐ సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మద్రిపాలెం: రౌడీషీటర్లు సత్ప్రవవర్తనతో మెలగాలని కంచరపాలెం ఐదో పట్టణ ఏఎస్ఐ ఆదిరాజు సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకూడదని, గొడవల్లో తలదూర్చకూడదన్నారు. నేరాల జోలికి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎల్లప్పుడూ రౌడీషీటర్లపై పోలీస్ నిఘా ఉంటుందని, బుద్ధిగా నడుచుకోవాలని సూచించారు.